## గుర్తింపులేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించొద్దు

**శంషాబాద్ ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్**

**శంషాబాద్:** శంషాబాద్ మండలంలో ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల జాబితాను శంషాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ మంగళవారం విడుదల చేశారు. జిల్లా విద్యాశాఖ నుంచి ఎలాంటి గుర్తింపు లేని పాఠశాలలో విద్యార్థులను చేర్పించరాదని ఈ సందర్భంగా ఆయన చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. గుర్తింపు లేని పాఠశాలలకు సంబంధించిన పేర్లను ఆయన వెల్లడించారు. న్యూహడా కాలనీలోని నారాయణ స్కూల్, ఏకే టౌన్‌షిప్‌లోని చోటా స్కూల్, రాళ్లగూడలోని సాంక్టస్ వరల్డ్ స్కూల్, శంషాబాద్ ఈరోకిడ్స్ ప్రీస్కూల్, నర్కూడలోని కాగ్నిటివ్ గ్లోబల్ స్కూళ్లకు ప్రభుత్వ అనుమతి లేదన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు దీనిని గమనించాలని ఆయన కోరారు.

## ఘనంగా రవీంద్రభారతి స్కూల్ స్నాతకోత్సవం



పట్టాలు అందుకున్న విద్యార్థులు

**రాజేంద్రనగర్:** రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వనితశ్రీ, పి.వి.నరసింహారావు హాజరయ్యారు. యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు ఆమె పట్టాలను అందజేశారు. అనంతరం వనితశ్రీ మాట్లాడుతూ... చిన్నారుల మధ్య తారతమ్య భేదాలు లేకుండా ఐక్యమత్యం పెంపొందించేలా కృషి చేయాలన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. రవీంద్రభారతి పాఠశాల డీన్ ప్రియ మనీష్, డివిజన్ ఇన్‌చార్జి మధు, ప్రిన్సిపాల్ సుధ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**గోల్కొండ:** అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పార్టీ అధిష్టానం మేరకు ఆయన కిసాన్ మోర్చా నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిసాన్ మోర్చా బృందాలు వర్షాలతో పంటలు దెబ్బతిన్న ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, రంగారెడ్డి, మెదక్, ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో పర్యటిస్తుందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని దెబ్బతిన్న ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే తాము ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు సరైన ధర ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు.

## విద్యార్థులు కళ్ల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**గోల్కొండ:** విద్యార్థులు కళ్ల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి అన్నారు. ఎక్సెస్ ఫౌండేషన్ వారు గోల్కొండ హెల్త్ క్లబ్ సౌజన్యంతో మంగళవారం కళాశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సర్వేంద్రియానాం నయనం ప్రధానమనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కంటి జబ్బులపై అత్యంత జాగ్రత్తగా ఉండాలని కంటి చూపు పోతే జీవితాంతం అంధకారంలో ఉండాల్సి వస్తుందన్నారు. ఎక్సెస్ ఫౌండేషన్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా కళ్లద్దాలు ఇస్తున్నారని, కాటరాక్ట్ శస్త్ర చికిత్స ఉచితంగానే చేస్తారన్నారు.



# కబ్జాకోరల్లో బుల్కాపూర్ నాలా

- యథేచ్ఛగా కొనసాగుతున్న ఆక్రమణలు
- ఓ వైపు హైడ్రా సర్వే.. మరోవైపు కబ్జాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు




బుల్కాపూర్ నాలాపై కొత్తగా ఏర్పాటు చేస్తున్న షాపులు

**మణికొండ:** అది చరిత్రాత్మక బుల్కాపూర్ నాలా.. దాన్ని పరిరక్షించటం, పునరుద్ధరించేందుకు ఓ వైపు హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు కృషి చేస్తున్నారు. ఇటీవలే హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆ నాలాను పరిశీలించి దాని బఫర్ జోన్‌లో వేసిన రేకుల ప్రహరీలను తొలగింప చేశారు. అవన్నీ పట్టించుకోకుండా ఏకంగా నాలాపైనే ఆక్రమణలు వస్తున్నా స్థానికంగా రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పట్టించుకోవటం లేదు. అధికారుల తీరుపై స్థానికులు సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- మణికొండ మున్సిపాలిటీ బీరప్ప దేవాలయం నుంచి పంచవటి కాలనీ వరకు ఉన్న బుల్కాపూర్ నాలా రోజుకింత చొప్పున అన్యాక్రాంతం అవుతుందని స్థానికులు వాపోతున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినపుడు నామమాత్రంగా కూల్చివేతలు చేపట్టి తరువాత పట్టించుకోకపోవటం షరామామూలవుతోంది. రోజుకిన్ని చొప్పున ఆక్రమణలు వస్తున్నాయని వారు పేర్కొంటున్నారు.
- మర్రిచెట్టు సర్కిల్ వద్ద నాలాను పూర్తిగా పూడ్చి ఓ భవన యజమాని ఏకంగా పార్కింగ్ స్థలంగా వాడుకోవటం, దాని తరువాత ఓ వైన్స్ నిర్వాహకులు నాలాను పూర్తిగా పూడ్చి పార్కింగ్ స్థలంగా మార్చివేశారు.
- ఆర్టీఏ కార్యాలయం సమీపంలో ఏకంగా నాలాపై హోటల్‌లు, డబ్బాలు వెలుస్తున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- మణికొండ మున్సిపాలిటీకి వచ్చే ప్రధాన రోడ్లయిన ఓయూ కాలనీ నుంచి మర్రి చెట్టు సర్కిల్ వరకు నాలాను ఆక్రమించి షాపులు, హోటల్‌లు వెలవటం వాటిని చూసిన వారు ఇదేమి మున్సిపాలిటీ అని చిన్న చూపు చూస్తున్నారు.
- ఇదే తరహాలో షేక్‌పేట నుంచి నార్సింగి ప్రధాన దారిలోను గండిపేట క్యాండూట్ కింద ఆక్రమణలు వచ్చి కళావిహీనంగా మున్సిపాలిటీ ప్రవేశాలు ఉన్నాయని కొత్తగా వచ్చే వారు అంటున్నారు. వాటిని తొలగించి మొక్కలు పెట్టి పార్కులా, వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేస్తే మున్సిపాలిటీ కేంద్రానికి మరింత శోభ చేకూరుతుందని పలువురు సూచిస్తున్నారు.
- మర్రిచెట్టు సర్కిల్ వద్ద ఉన్న బస్‌షెల్టర్‌ను వెనక్కి మార్చితే బస్సు షెల్టర్ ఏర్పాటు చేస్తే ఎంతో మందికి ఉపయోగపడుతుందని వారు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి బుల్కాపూర్ నాలా ప్రాంతాన్ని పరిరక్షించటంతో పాటు శోభాయమానంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.



బుల్కాపూర్ నాలాపై వెలసిన ఆక్రమణలు

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**శంషాబాద్:** అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ఎంతగానో ఉపకరిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని వివిధ బస్తీలకు చెందిన పేదలకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 3.92 లక్షలకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్ని సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి మాజీ ఏఎంసీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ వై.కుమార్, నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

**శంషాబాద్:** వరంగల్ పట్టణంలో ఈ నెల 27 నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా నుంచి లక్ష మందికిపైగా ప్రజలు, కార్యకర్తలు, అభిమానులకు తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ తీరుతో ప్రజలు విసుగెత్తి పోయారన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న లక్ష్మీనివాస్ తదితరులు

**రాజేంద్రనగర్:** ప్రభుత్వ నిబంధలను పాటించని రంగారెడ్డి జిల్లాలోని ప్రైవేటు స్కూళ్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేటు స్కూళ్లలో బుక్స్, పెన్సిల్స్, స్టేషనరీ, దుస్తులు విక్రయిస్తున్నారు. దీనిపై ఎన్ని సార్లు రంగారెడ్డి డీఈఓకు చెప్పినా పట్టించుకోకపోవడంతో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి డీఈఓ రిఫర్ చేశారన్నారు. విద్యా హక్కు చట్టాన్ని నీరుగారుస్తూ విద్యను వ్యాపారంగా చేస్తున్న స్కూళ్లు, అనుమతి లేని పాఠశాలలను తక్షణమే మూసివేసి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి టీఎస్‌ఎస్‌ఓ రమేశ్ గౌడ్, రఘు ముదిరాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సరిపడా నీటిని సరఫరా చేయించండి



జలమండలి ఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఫెడరేషన్ నాయకులు

**మణికొండ:** వేసవిలో ఎండలు ముదిరిపోవడంతో బోర్లు వట్టిపోయి అపార్ట్‌మెంట్‌లు, గృహాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి సరిపడేలా నల్లాల్లో నీటిని సరఫరా చేసి సమస్యను నివారించాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ఆఫ్ ఫెడరేషన్ నాయకులు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కోరారు. మంగళవారం వారు జలమండలి కార్యాలయంలో ఎండీతో పాటు సీజీఎం రవీందర్‌రెడ్డి, డీజీఎం నారాయణలను ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ, ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులుల ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో గత నెలల్లో 1.15 గంటల పాటు చేసిన నీటి సరఫరాను 45 నిమిషాలకు కుదించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాన్ని తిరిగి పాత సమయం ప్రకారం నీటిని సరఫరా చేయాలన్నారు. ట్యాంకర్లు బుక్ చేసిన వారికి ఏ రోజుకు ఆ రోజు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోరిన వారికి నెల వారీగా ట్యాంకర్లు సరఫరా చేసే విషయాన్ని పరిశీలించాలన్నారు. నెలవారీగా నీటి బిల్లులను వినియోగదారులకు పంపటం, నీటి కనెక్షన్‌లు ఉన్న వారందరికీ క్యాన్ నెంబర్‌లను కేటాయించటం, కొత్త నీటి కనెక్షన్‌లకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు బదులుగా నిర్మాణ అనుమతులను పరిగణలోకి తీసుకోవాలని కోరామని అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. పై విషయాలపై వినతిపత్రం సమర్పించామని వెల్లడించారు. అధికారుల నుంచి అన్ని విషయాల్లో సానుకూల స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కోశాధికారి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రాజలింగం, కార్యనిర్వాహక కార్యదర్శి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**మణికొండ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం కింద లబ్ధి పొందాలనుకునే ఔత్సాహిక నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ తెలిపారు.దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. 21 సంవత్సరాలు పైబడి వయస్సున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదార్ పాస్ బుక్ (వ్యవసాయ పథకం కోసం), సదరం సర్టిఫికెట్లు (పీడబ్ల్యూడీఎస్), పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలను సమకూర్చుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న వారు మీసేవా కేంద్రాలు, ప్రజాపాలన సేవ కేంద్రాల(పుర పాలక సంఘం కార్యాలయం)లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## శుభాకాంక్షలు



కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నూతన డీన్ ఆఫ్ హార్టికల్చర్, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్‌గా నియమితులైన డాక్టర్ చిన్నా నాయక్‌ను మంగళవారం వర్సిటీ విద్యార్థి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. – రాజేంద్రనగర్

## కాలనీల అభివృద్ధికి కృషి



మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీవాసులు

**బండ్లగూడ:** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ శాంతినగర్ ఫేస్–1 కాలనీ వాసులు మంగళవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీల అభివృద్ధికి తమ వంతు బాధ్యత వహిస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తేవాలన్నారు. అందరూ కలిసికట్టుగా ఉంటూ కాలనీని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, నాయకులు రాజిరెడ్డి, పి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి షీల్డ్‌లు అందజేశారు.

## వివాదాస్పద భూములను పరిశీలించిన హెచ్‌ఎండీఏ కమిషనర్

**శంషాబాద్:** శంషాబాద్ పట్టణంలో సుమారు ముప్పైకి పైగా ఎకరాల్లో వివాదాస్పదంగా ఉన్న వివిధ భూములను హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మంగళవారం అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. పట్టణంలోని సింప్లెక్ రహదారి నుంచి ఇరువైపులా హెచ్‌ఎండీ ఆధీనంలో ఉన్న భూములతో పాటు వివాదాస్పదంగా కోర్టుల్లో ఉన్న భూములన్నింటినీ ఆయన ఒక్కొక్కటిగా పరిశీలించారు. సింప్లెక్స్ నుంచి జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం గృహాల వరకు సుమారు రెండు కిలో మీటర్ల మేరకు నడుచుకుంటూ వెళుతూ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏయే భూములు వివాదంలో ఉన్నాయి.. ప్రభుత్వ అవసరాలకు అప్పగించిన భూములు, నర్సరీలు ఉన్న భూముల వివరాలు తీసుకున్నారు. భూమిని కోల్పోయిన ప్రత్యామ్నాయంగా హెచ్‌ఎండీఏ నుంచి తీసుకున్న భూముల వివరాలను కూడా తెలుసుకున్నారు. కోర్టులో ఉన్న వివాదాస్పదంగా ఉన్న భూములపై కౌంటర్ దాఖలు చేసేందుకు పటిష్టంగా వివరాలు సేకరించినట్లు సమాచారం. కమిషనర్ వెంట హెచ్‌ఎండీఏ అధికారుల బృందంతో పాటు శంషాబాద్ తహసీల్దార్ రవీందర్‌దత్ ఉన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత




కోకాపేటలో కూల్చివేస్తున్న దృశ్యం

**మణికొండ:** ప్రభుత్వ భూమిలో అక్రమంగా వెలసిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. గండిపేట మండలం కోకాపేట సర్వే నెంబర్ 100లో ప్రభుత్వ భూమి ఉంది. అందులో రేకులతో షెడ్‌లను ఏర్పాటు చేసుకుని కొందరు రాజకీయ నాయకుల అండగా వ్యాపారాలు చేస్తున్నారు. ఆ విషయం తెలిసిన గండిపేట తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో మంగళవారం ఉదయం నార్సింగి పోలీసుల బందోబస్తు మధ్య వాటిని పూర్తిగా కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. మరోసారి అక్కడ ఎలాంటి నిర్మాణాలు వచ్చినా వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామన్నారు. కూల్చివేతల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## అంధకారంలో కిస్మత్‌పూర్



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

**బండ్లగూడ:** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో అంధకారం నెలకొంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు కూడా మరమ్మత్తులు కొనసాగడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కిస్మత్‌పూర్ బ్రిడ్జీ వద్ద ఉన్న 11కేవీ విద్యుత్ తీగలపై రాత్రి గిరిధారి కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఇనుప చివ్వలు పడిపోయాయి. దీంతో వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. స్థానికులు విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలపడంతో వారు సరఫరాను పూర్తిగా నిలిపి వేసి మరమ్మతు పనులు ప్రారంభించారు. రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేయడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అసలే వేసవి కావడంతో విద్యుత్ లేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు.



# ఫీజు కట్టమన్నందుకు టోల్ గేటు సిబ్బందిపై దాడి

**శంషాబాద్ రూరల్:** టోల్ ఫీజు చెల్లించకుండా సిబ్బందిపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన తొండుపల్లిలోని ఔటర్ రింగు రోడ్డు టోలు గేటు వద్ద చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు మంగళవారం టీఎస్08–ఈఎస్0027 కారులో తొండుపల్లి టోల్ గేటు వద్దకు చేరుకున్నారు. అక్కడ విధులో ఉన్న సంజయ్ దత్ వీరి కారును ఆపి ఫీజు చెల్లించాలని కోరాడు. తాము మీడియాకు చెందిన వారమని ఓ సారి.. స్థానికులమంటూ మరోసారి పొంతన లేని సమాధానం చెప్పారు. ఆధార్ కార్డు చూపించమంటే అందుకు నిరాకరించారు. దీంతో ఫీజు చెల్లించాలని అడగడంతో.. ఇద్దరు వ్యక్తులు కారులోంచి కిందకు దిగి.. సంజయ్‌దత్ పాటు అక్కడే విధుల్లో ఉన్న సూపర్‌వైజర్ మహేందర్‌ను బూతులు తిడుతూ.. వారిపై దాడి చేశారు. అనంతరం అక్కడి నుంచి కారులో పారిపోయారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. కారు నంబరు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. యజమాని ఈ కారును ఇది వరకే వేరే వ్యక్తులకు అమ్మినట్లు తేలింది. దీంతో నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదుల నిరసన

**యాకుత్‌పురా:** న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అందుబాటులోకి తీసుకురావాలని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఏ.ఎన్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బి.అజయ్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లో న్యాయవాది మహ్మద్ ముస్తాఫా అలీపై జరిగిన దాడిని నిరసిస్తూ పురానిహవేలీలోని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టులోని న్యాయ దేవత విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయన్నారు. న్యాయవాదిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు తిరిగి జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూలో విద్యార్థుల నిరసన

**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు మంగళవారం నిరసన తెలిపారు. హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు విద్యార్థి సంఘం 2024–25 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో పలు విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు నినాదాలు చేశారు. కాగా క్యాంపస్‌లో నిరసన సందర్భంగా నమోదు చేసిన కేసులను ప్రభుత్వం ప్రకటించినట్లుగానే వెంటనే ఉపసంహరించాలని, రిమాండ్‌లో ఉన్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ హెచ్‌సీయూ భూములపై పోరాటం కొనసాగుతుందన్నారు.



హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

## అధికారులు మరింత క్రియాశీలకంగా పని చేయాలి



**గోల్కొండ:** అధికారులు మరింత క్రియాశీలకంగా పని చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ కాకతీయనగర్ కాలనీలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాఖల పనితీరుపై సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలోని ఎన్నో ప్రాంతాల్లో డిసిల్టింగ్ పనులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఎస్‌పీ–2, 3 పనులు ఇంకా పూర్తి కాలేదని, రోడ్లకు మరమ్మతులు కూడా పూర్తి కాలేదన్నారు. అదే విధంగా ప్రజలకు తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని నల్లాల్లో వస్తున్న నీరు ప్రజల తాగునీటి అవసరాలను తీర్చలేకపోతుందన్నారు. బస్తీలు, కాలనీల్లో వెలగని వీధి దీపాలు ఎన్నో ఉన్నాయన్నారు. వాటికి మరమ్మ తు లు చేసి కొత్త విద్యుత్ దీపాలు అమర్చాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా పాతకాలం నాటి డ్రైనేజీలు ఉన్నాయని పైప్‌లైన్‌లు పూర్తిగా ధ్వంసమై మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. అదే విధంగా బస్తీలు, కాలనీల నుంచి రాత్రి సమయంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని టోలిచౌకీ నుంచి లంగర్ హౌస్ వెళ్లే వారు ఎండీ లైన్స్ రోడ్డు మీదుగా వెళ్తున్నారని ఈ కారణంగా బస్తీల అంతర్గత రోడ్లల్లో సైతం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో బల్దియా ఈఈ వెంకట శేషయ్య, ఏఈ ఉదయ్, జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌నాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.